



ఆర్‌జెడిని అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పింఛన్ల కోసం పడిగాపులు

- సచివాలయాల వద్ద లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఏర్పాట్లు చేయని అధికారులు - జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సామాజిక భద్రత పింఛను పొందుతున్న లబ్ధిదారులకు నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను అందజేయాలని ప్రతిపక్షాలు కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించ లేదు. సచివాలయాల వద్దనే లబ్ధిదారులకు పింఛను పంపిణీ ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయడం పట్ల ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పింఛన్ల కోసం సచివాలయాల వద్ద లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. లబ్ధిదారులకు నీడ వసతి కల్పించేందుకు ఎలాంటి టెంట్లు కానీ, తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. పింఛన్ల పంపిణీ తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆదోని 21వ వార్డు సచివాలయం వద్ద బారులు తీరిన పింఛన్‌దారులు

జిల్లాలో బుధవారం నుంచి సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. సచివాలయాల్లోనే లబ్ధిదారులకు పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌కు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. సచివాలయాల నుంచే పింఛను పంపిణీకి చర్యలు చేపట్టారు. కేవలం అనారోగ్యంతో బాధపడేవారు, వికలాంగులకు మాత్రమే ఇంటి వద్దకు వెళ్లి పింఛను పంపిణీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఉదయం 11 గంటల తర్వాతనే సచివాలయ సిబ్బంది అక్కడికి చేరుకొని లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. మండుటెండలో పింఛన్లు తీసుకుని ఇళ్లకు వెళ్లడంతో లబ్ధిదారులు కొంత అసహనానికి గురయ్యారు. సచివాలయాల వద్ద పింఛను లబ్ధిదారులు కూర్చునేందుకు అవసరమైన సీటింగ్, టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. గంటల తరబడి లబ్ధిదారులు సచివాలయ ప్రాంగణం ఎదుటే కూర్చుని ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛను నగదు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

జిల్లాలో సామాజిక భద్రత పింఛన్ల వివరాలు

వృద్ధాప్య	1,28,094
వితంతు	71,727
వికలాంగులు	31,764
ఒంటరి మహిళలు	5902
అభయ హస్తం	2572
ఇతర పింఛన్లు	7487
మొత్తం పింఛన్లు	2,47,546

పింఛన్ల పంపిణీ వివరాలు

గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేసిన పింఛన్లు 90,355
ఇంకా పంపిణీ చేయాల్సిన పింఛన్లు 1,56,516
పింఛన్ల పంపిణీ శాతం
36.6 శాతం
జిల్లాలో ఈ నెలలో మంజూరయిన పింఛన్లు 2,46,871

పోలింగ్ విధులపై అవగాహన అవసరం

- ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలి
- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పోలింగ్ విధులపై సిబ్బంది స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గైడ్‌లైన్స్‌ను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మిగనూరులోని బాబు ఫంక్షన్ హాలులో నియోజకవర్గానికి సంబంధించి సాధారణ ఎన్నికల నిర్వహణపై బూత్ లెవెల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, ఎంసిసి బృందాలకు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సాధారణ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది సొంత నిర్ణయాలు తీసుకోకుండా ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గనిర్దేశకాలను పాటిస్తూ వారికి ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ రోజున బిఎల్‌ఒలు, సెక్టార్ అధికారులు ఈవిఎంలను ఏ విధంగా కనెక్ట్ చేయాలి, ఏ విధంగా తొలగించాలి, మ్యాక్ పోల్ నిర్వహణ, మ్యాక్ పోల్ స్లిప్స్ నిర్వహణ, మ్యాక్ పోల్ క్లియర్ చేయడం, పోలింగ్ యంత్రాలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. పోలింగ్ పూర్తయిన వెంటనే కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్ మిషన్లు, వివి ప్యాట్ స్లిప్స్, పిఒ డైరీ 17(సి), పిఒ రిపోర్ట్‌తో స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిఎల్‌ఒలు పోలింగ్‌కు మూడు రోజుల ముందు ఓటర్ స్లిప్స్ పంపిణీని పూర్తి చేయాలని, ఏవైనా స్లిప్స్ మిగిలిపోతే ఆర్‌ఒకు అందజేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి పోలింగ్ కోసం వచ్చే ఓటర్ల కంటే ముందు రోజే వచ్చి అక్కడే విధులు నిర్వహించే సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంకా పోలింగ్ కేంద్రాల్లో లోపాలుంటే సెక్టోరల్ అధికారులు, బిఎల్‌ఒలు తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల దారులకు మరమ్మతులు అవసరమైతే ఆర్‌ఒ ద్వారా తమ దృష్టికి తెస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్క ఓటరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నచ్చిన వారికి ఓటు వేసుకునే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఎంసిసి టీమ్స్ మీద ఉందన్నారు. ఎవరైనా తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటామన్న భరోసాను ప్రజలకు కల్పించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న హోర్డింగులపై బ్యానర్స్, పోస్టర్స్, గోడ మీద రాతలు ఉండకుండా చూడడంతో పాటు తాత్కాలిక పోస్టర్ల ఏర్పాటుకు ఆర్‌ఒ అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ప్రయివేట్ భవనాలపై అయితే యజమాని అనుమతితో పాటు ముందుగా ఆర్‌ఒ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా పోస్టర్లు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రచారానికి సంబంధించి సువిధ పోర్టల్ ద్వారా అనుమతి పొందాలన్నారు. ఇంటింటి ప్రచారానికి సంబంధించి కూడా అనుమతి తీసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రభుత్వ పాఠశాల

విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి

- పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి రాఘవరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యం కావాలని పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి కోరారు. బుధవారం కర్నూలుకు విచ్చేసిన ఆయన నగర శివార్లలోని డైట్ కళాశాలలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఏమైనా సమస్యలుంటే డిఇఒ లేదా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులే క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలియజేశారు. అలాగే ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా ఈ సమావేశంలో పాల్గొని తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి

- పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడికి ఫ్యాప్టో వినతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు ఆర్‌జెడిని కోరారు. బుధవారం పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి రాఘవరెడ్డిని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధి బృందం కలిసి పలు సమస్యలను విన్నవించింది. యుటిఎఫ్ నుంచి రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యుఆర్‌ఎ.రవికుమార్, నవీన్ పాటి, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, ఎస్‌టియు నుంచి టికె.జనార్ధన్, ఎపిటిఎఫ్ (257) నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రంగన్న ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, ఆప్టా నుంచి సేవ నాయక్, మధుసూదన్ రెడ్డి, హెచ్‌ఎంఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, వై.నారాయణలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతేడాది రెగ్యులర్, సప్లిమెంటరీ పదో తరగతి మూల్యాంకనం నిధులు ఇంతవరకు ఉపాధ్యాయులకు అందలేదని తెలిపారు. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఏడాది పదో తరగతి పరీక్షల నిర్వహణ నిధులు, మూల్యాంకనం నిధులను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడితో పని చేస్తున్నారని, వారికి బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని కోరారుర. ప్రతేడాది వేసవి సెలవుల్లో పని చేసినందుకు వారికి రావాల్సిన సంపాదిత సెలవులను మంజూరు చేయాలన్నారు. జిల్లాలో సుమారు 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికలు, మూల్యాంకన విధుల నుంచి దీర్ఘకాలికంగా బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ట్రైనింగ్ రోజున సస్పెండ్ అయిన సత్యనారాయణ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు.



ఆర్‌జెడి రాఘవరెడ్డిని కలిసిన ఫ్యాప్టో నాయకులు

బిఇడి సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బిఈడి-2023 ప్రథమ సెమిస్టర్ సంబంధించిన రీ వాల్యుయేషన్ ఫలితాలను వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ బుధవారం విడుదల చేశారు. 2964 మంది విద్యార్థులకు గాను 770 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను రాయలసీమ యూనివర్సిటీ వెబ్సైట్లో పొందుపరిచారు.



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - వెల్దుర్తి : వెల్దుర్తి మండలం బోయినపల్లి గ్రామ వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వెల్దుర్తి పట్టణంలోని స్థానిక ఎంపిడివో కార్యాలయంలో వాలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపిడివో శివశంకరప్పకు అందజేశారు. వారు మాట్లాడుతూ తాము నాలుగేళ్లుగా గౌరవ వేతనంతో స్వచ్ఛందంగా, నిస్వార్ధంగా పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించామని, ప్రభుత్వం సూచించిన ప్రతి పనిని పార్టీలకు అతీతంగా బాధ్యతగా నెరవేర్చామన్నారు. తమపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నందుకు బాధతో రాజీనామా సమర్పించినట్లు పేర్కొన్నారు. **మద్దికెర :** పెరవలి, మద్దికేర, ఆగ్రహారం గ్రామాలకు చెందిన 54 మంది వాలంటరీలు రాజీనామా పత్రాలను ఎంపిడివో ఆఫీస్ సూపర్డెంట్ స్వర్ణలతకు అందజేశారు. ఎన్నికల కోడ్‌కు సహకరిస్తూ, స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వాలంటరీలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - తుగ్గలి : మండలం పరిధిలోని మామిల్లకుంట, కోతికొండ, పెండెకల్లు తదితర గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం పత్తికొండ ఆర్‌డిఒ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల రోజు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, ఆర్‌ఐ సుధాకర్ రెడ్డి, విఆర్‌ఒలు రహిమాన్, కాశి రంగస్వామి, వెంకటరాముడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజేష్, ఆర్డీవో ఆఫీస్ సిఒ రవి తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే ప్రజా సంక్షేమం : ఎంపిటిసి

ప్రజాశక్తి - సి బెళగల్ : ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని బెళగల్ ఎంపిటీసీ ఈరన్న గౌడ్, పార్టీ నాయకులు మల్లికార్జున గౌడ్, ధనుంజయలు, బీమన్న తదితరులు పేర్కొన్నారు. బుధవారం బెళగల్‌లో ముఖ్య కార్యకర్తలతో కలిసి వారు బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడమే టీడీపీ ధ్యేయమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నాయకులు బాలాజీ, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కంటి శుక్లాలకు సులభమైన చికిత్స

- ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ స్వాతి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

'కళ్ళు లేకుండా లోకాన్ని చూడలేం. కళ్లక సమస్త ప్రపంచాన్ని చూపిస్తాయి. అయితే ఈ కళ్లకు ఎన్నో సమస్యలు ఏర్పడుతున్నాయి. అందులో కంటి శుక్లాల సమస్య ముఖ్యమైంది. ప్రస్తుతం కంటి శుక్లాలకు సులభమైన చికిత్స అందుబాటులో ఉంది' అని ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ స్వాతి తెలిపారు. బుధవారం నగరంలోని సి.క్యాంప్ వద్ద శకుంతల కళ్యాన మండపం లైన్‌లో ఉన్న భరత్ హాస్పటల్‌లో డాక్టర్ స్వాతి ప్రజాశక్తితో మాట్లాడారు. శుక్లాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వెలుగు చూడలేకపోతున్నారని అన్నారు. కంటి శుక్లాలు వయసుతో ముడిపడ్డ సమస్య అని, ప్రధానంగా 50 ఏళ్లు పైబడిన వారికి వస్తుందన్నారు. కంటికి దెబ్బ తగిలినా, ఇతర కంటి అనారోగ్యాల కారణంగా ఇది రావచ్చన్నారు. పుట్టుకతో లేదా పుట్టిన ఏడాది తర్వాత కూడా వచ్చే అవకాశాలుంటాయని చెప్పారు. చిన్నపిల్లలకు సరైన సమయంలోనే ఆపరేషన్ చేయించాలని, లేకపోతే శాశ్వత చూపు పోయే ప్రమాదం ఉందన్నారు. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే శుక్లాల కారణంగా చూపు కోల్పోతున్న వారి సంఖ్య మన దేశంలోనే ఎక్కువన్నారు. కేంద్ర ప్రభుత్వ అంధత్వ నివారణ వారి గణాంకాల ప్రకారం దేశంలో దృష్టి లోపంతో బాధపడుతున్న కోటి 20 లక్షల మందిలో 80 శాతం మంది కంటి శుక్లాల బారినపడిన వారేనని తెలిపారు. ఇలాంటి అంధత్వాన్ని ఆపరేషన్‌తో సరిచేయవచ్చన్నారు. శుక్లాల్లో కంటిపై కప్పుకున్న సహజమైన పొర తెల్లగా మారి క్రమంగా చూపు మందగిస్తుందన్నారు. దీన్నే తెలుపు శుక్లం అంటారని, ఈ వ్యాధికి మొదట్లో కళ్ళద్దాలు వాడి దృష్టిని సరి చేసుకోవచ్చన్నారు. కానీ ఇది పెరిగే కొద్దీ కళ్ళద్దాలూ మార్చాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఒక దశ దాటితే కళ్ల జోళ్లతోనూ సమస్య పరిష్కారం కాదని, ఆపరేషన్ చేయడం వల్లే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. శుక్లాలను సులభంగా తొలగించడానికి అత్యాధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో చేసే ప్రక్రియను 'ఫైకో ఇమల్సిఫికేషన్ అంటారని, ఇందులో కంటిలోని పొరపై 3 మిల్లీ మీటర్ల మేర చిన్న గాటు పెట్టి 'ఫైకోమిషన్'ను లోపలికి పంపుతారని, ఇది శుక్లాన్ని లోలోపలే తొలగించి కంటి బయటకు లాగేస్తుందని తెలిపారు. ఆపైన ఈ చిన్న గాటు నుంచే మడిచిన లెన్సు ఒక దానిని కంటి లోపల ఫిట్ చేస్తారన్నారు. అదే లోపల అమరిన తర్వాత మడత నుంచి విప్పారి నిటారుగా కుదురుకుంటుందని, దీంతో కంటికి కుట్లు వేయాల్సిన అవసరం ఉండదన్నారు. సూది, కుట్లు లేకుండా ఆపరేషన్ పూర్తవుతుందని చెప్పారు. ఈ ఆపరేషన్ తర్వాత రోగి ఒక్క రోజులోనే స్పష్టంగా చూడగలడని, రెండు రోజుల తర్వాత అన్ని పనులు స్వయంగా చేసుకోగలడని, వారం రోజులు గడిచాక కంటికి తీసుకోవాల్సిన కళ్ళద్దాల నంబరు నిర్ణయిస్తారని తెలిపారు. కుట్లతో జరిపిన ఆపరేషన్లో రెండు నెలల తర్వాత అద్దాలు ఇస్తారని, ఈ ఆపరేషన్‌లో ఖరీదైన పరికరాలు వాడతారని, అందుకే సాధారణ ఆపరేషన్ కంటే ఈ ఆపరేషన్ ఎక్కువ ఖర్చుతో కూడుకుందని చెప్పారు. ఫైకోమిషన్ చికిత్స శుక్లాల రోగులకు ఒక వరం లాంటిదన్నారు. ఈ ఆపరేషన్ ఖర్చు ఎక్కువ అయినా ఎంతో సులభంగా, నొప్పి లేకుండా తక్కువ సమయంలో పూర్తవుతుందని డాక్టర్ స్వాతి తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి



స్విమ్మింగ్ పూల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

స్విమ్మింగ్ పూల్ శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆధునీకరించిన స్విమ్మింగ్ పూల్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం పరిశీలించి బేబీ పూల్‌ను ప్రారంభించారు. వేసవిలో నిర్వహించనున్న స్విమ్మింగ్ పూల్ క్యాంప్ శిబిరాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ తీసుకోవడానికి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటున్నారని, బ్యాచ్‌లు పెంచుకునే అవకాశం కల్పించాలని సెట్కూర్ సిఇఒ, డిఎస్‌డిఒ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ మంది వస్తున్న తరుణంలో బ్యాచ్‌లు పెంచే విధంగా చూసుకోవాలన్నారు. సెట్కూరు సిఇఒ రమణ, డిఎస్‌డిఒ భూపతి రావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్ రావు, క్రీడాసంఘాల ప్రతినిధులు, శిక్షకులు పాల్గొన్నారు.

5లోపు పింఛన్ల పంపిణీ పూర్తి

ఈనెల 5లోపు పింఛన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సచివాలయ సిబ్బంది అందరూ ఫీల్డ్‌కు వెళ్లకూడదన్నారు.. 1/3 మంది సిబ్బంది సచివాలయంలో ఉండి పింఛన్లను పంపిణీ చేయాలని సూచించారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

టిడిపిని ఆదరించండి : కెఇ శ్యాంబాబు

ప్రజాశక్తి - క్రిష్ణగిరి : త్వరలో జరిగే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని పత్తికొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం క్రిష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడి, మన్నెగుంట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం పెట్టిన పార్టీ అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి నబిసాహెబ్, మండల అధ్యక్షులు శ్రీరాములు, తెలుగు యువత అధ్యక్షుడు రఫీ మాదాపురం గురుస్వామి, నాయకులు సురేంద్రారెడ్డి, సుంకన్న, దావీదు, కాజా హుస్సేన్, హమ్మద్ ముంతాజ్ బేగం, నజరీన్ బేగం, రామకృష్ణ, నాగార్జున, మౌలాలి, సుదర్శనం, కురువ బజారి, చిందుకూరు రాముడు, డీలర్ కృష్ణమూర్తి, మాధవస్వామి, జిల్లిబిల్లి మాదన్న, జీర్రా వెంకటేశ్వర్లు, వీరభద్రుడు, నక్క నాగరాజు, ఎల్వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు కర్ణాటక యాత్రికులకు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో మూడవ రోజు బుధవారం నందికొట్కూరు రోడ్డు పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర శ్రీశైలం కాలినడకన వెళ్లే యాత్రికులకు ఉదయం 7 గంటల నుండి ఉప్మా, చల్లని వాటర్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. 11 గంటల నుండి చల్లని మజ్జిగ, 12 గంటల నుండి పెరుగన్నం, చల్లని వాటర్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ టి.శివరామకృష్ణ మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో ఉప్మా, పెరుగన్నము, చల్లని మజ్జిగ ప్యాకెట్స్, వాటర్ ప్యాకెట్స్‌ను సూర్య దేవాలయ సిబ్బంది అందరి సొంత సహకారంతో అందించారని తెలిపారు. కార్యక్రమం లో దేవాలయ కమిటీ సభ్యులు డాక్టర్ ఆంజనేయులు, శ్రీదేవి, దేవాలయ సిబ్బంది రామమహేశ్వరప్ప, ధనుంజయ్, నాగరాజు, మహేందర్, మద్దిలేటి, వీరమ్మ, చిన్మయి, మాధవి, మల్లేశ్వరి, మద్దమ్మ, ఎల్లమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.




మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

'కందుకూరి'లో ఉగాది, రంజాన్ స్పెషల్ ఆఫర్స్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని కందుకూరి ఫ్యామిలీ షాపింగ్ మాల్ నందు ఉగాది, రంజాన్ పండుగలా సందర్భంగా స్పెషల్ ఆఫర్స్ నడుస్తున్నాయని మాల్ యాజమాన్యం బి.రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ షాప్‌లో రూ.1500 కొనుగోలు నుంచి పోర్ట్ గిఫ్ట్ ఇస్తున్నామన్నారు. కందుకూరి మాల్ నందు వేసవి కాల సందర్భంగా కరిష్మా, సర్వోదయ, మీనా, వసుంధర, ఎంపీ, కందుకూరి, శ్రీ కాటన్ శారీస్ వంటి కాటన్ చీరలు మిల్లు ధరలకే లభిస్తున్నాయని తెలిపారు. రూ.1400 విలువ చేసే పోచంపల్లి ఇక్కత్ శారీ రూ.995, రూ.2000 విలువ చేసే టిష్యూ బ్రాకెట్ పట్టు శారీ రూ.1395, రూ.3000 విలువ చేసే వైభాగ్య జరీ పట్టు శారీ రూ.1995 ధరలకే లభిస్తున్నాయని తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా శారీస్, ఫాన్సీ డ్రెస్సెస్, మెన్స్‌వేర్లపై వన్ ప్లస్ వన్ ఆఫర్స్ నడుస్తున్నాయని, కర్నూల్ ప్రజలు మాల్‌కు విచ్చేసి పండుగ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ఎగబడిన పింఛన్‌దారులు

ప్రజాశక్తి - ఆదోని

పింఛన్ కోసం వృద్ధులు, మహిళలు, వికలాంగులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదోని పట్టణంలో బుధవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. 1వ తేదీనే పింఛను తీసుకునే వృద్ధులు, వితంతువులు, మహిళలు, వికలాంగులు సచివాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పింఛన్ల పంపిణీ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలో 42 వార్డులు ఉన్నాయని, 17,294 మంది పింఛన్‌దారులు ఉన్నారని వివరించారు. మూడు రోజులపాటు పింఛన్ల పంపిణీ చేస్తామని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు ఇంటి దగ్గరే ఉండాలని సూచించారు. పింఛను అందేలా ఇప్పటికే ఏర్పాట్లు చేశామన్నారు.

కనబడని టెంట్లు : పట్టణంలో బుధవారం మధ్యాహ్నం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సచివాలయాల వద్ద తాగునీరు, ఎండ వేడి తగలకుండా టెంట్లు ఏర్పాటు వంటి సదుపాయాలు కనపడలేదు. అరకొర కుర్చీలు మాత్రమే ఏర్పాటు చేశారు. అవి చాలక చాలా మంది అక్కడక్కడ కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని 21వ వార్డు సచివాలయం వద్ద పింఛను డబ్బు కోసం బారులు తీరారు. లైన్‌లో నిలబడలేక వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. **ఆదోని (రూరల్)** మండలం పెద్దహరివాణం గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో పింఛను కోసం పడిగాపులు తప్పడం లేదు. మధ్యాహ్నం 1 గంట అయినా పింఛను పంపిణీ చేయడంలో సచివాలయ సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని వృద్ధులు వాపోయారు. ఉదయం 10 గంటలకు వచ్చినా మధ్యాహ్నం 1 గంట అయినా పింఛను అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని


నాయకులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు ఎన్నికల సమావేశానికి, ర్యాలీలకు, రాష్ట్రస్థాయికి సంబంధించిన పోస్టర్లకు, వీడియో వెహికల్, హెలీప్యాడ్స్‌కు, ఎయిర్ బెలూన్స్ కోసం సువిధ ద్వారా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోకల్ మీటింగ్స్, ర్యాలీలు, ఇతర ప్రచారాలకు ఆర్ఓ ద్వారా అనుమతులు పొందవచ్చని తెలిపారు. అనుమతులకు ఫిజికల్‌గా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అనుమతులు ఇచ్చేటప్పుడు డిజిటల్‌గా అనుమతులు ఇస్తారని చెప్పారు. నియోజకవర్గంలో ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, డీఎస్పీ శివ నారాయణ స్వామి, డీఎస్పీ (ట్రైనీ) ధీరజ్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంపిడిఒ విజయ శేఖర్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికి తీతకే ఐఎన్‌టిఎస్‌సి

ప్రజాశక్తి - ఆదోని


బహుమతులు అందుకున్న విద్యార్థులు

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ గౌసియా భానమ్ తెలిపారు. బుధవారం శ్రీచైతన్య-1 పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు నైపుణ్యం చాటుకుంటే ఆమె చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ మొదటి బహుమతి 5వ తరగతి విద్యార్థి వరలి వర్ష ట్యాబ్ కైవసం చేసుకుంది. రెండో బహుమతి ఈశ్వర్, మూడో బహుమతి సాయి వైష్ణవి, నాలుగో బహుమతి అక్షయ్య సంజీవ్, ఐదో బహుమతికి నలుగురు విద్యార్థులు, స్పెషల్ బహుమతికి నలుగురు విద్యార్థులు, కన్సోలేషన్ బహుమతులు 29, గోల్డ్ మెడల్స్ 36, మెరిట్ సర్టిఫికెట్స్ 233 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఇటువంటి బహుమతులను విద్యార్థులు మరెన్నో కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఎటిఎం సురేష్, ఆర్ఐ రంగారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎఒ అశోక్, అకాడమిక్ డీన్ వీరారెడ్డి, ఒలంపియాడ్ ఇన్‌ఛార్జీలు అశోక్, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరప రైతు కంట కన్నీరు

- రూ.లక్షల్లో పెట్టుబడులు
- రోజురోజుకూ మార్కెట్‌లో క్షీణిస్తున్న ధర
- దిక్కుతోచని స్థితిలో రైతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈఏడాది మిరప రైతు కంట కన్నీరే మిగిలే పరిస్థితి ఏర్పడింది. గతేడాది మిరప పంటకు మంచి ధర పలకడంతో ఈ ఏడాది రైతులు అధిక శాతం మిరపను సాగు చేశారు. దిగుబడులు మోస్తరుగా వచ్చినా ధర క్షీణిస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.


ధర తగ్గడంతో చెట్లు కిందనే మిరప నిలువలు

గతేడాది మిరప ధర ఆశాజనకంగా ఉండడంతో ఈఏడాది రైతాంగంలో మిరప పంటను సాగు చేశారు. మండలంలోని చిప్పగిరి, ఏరూరు, దేవలాపురం, గుమ్మనూరు, కాజీపురం, బెల్డోన, బంటనహాల్ గ్రామాల్లో మిరప పంటను అధికంగా సాగు చేసినట్లు వ్యవసాయ గణాంకాలు తెలుపుతున్నాయి. మండలం మొత్తం సాగు విస్తీర్ణం 44,162 ఎకరాలు. ఖరీఫ్ సీజన్ సాగు 7,400 ఎకరాలు కాగా రబీ సీజన్‌లో 36,762 ఎకరాల్లో సాగు చేస్తారు. ఎకరా మిరప సాగు చేసేందుకు దాదాపు రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు ఎంత ఆచరించినా మిరప పంటలో తెగుళ్లు వస్తూనే ఉంటాయని, వారానికోసారి తప్పనిసరిగా నీళ్ల మందులు స్ప్రే చేస్తూనే ఉండాలని రైతులు చెబుతున్నారు. ఒక నెలలో మూడుసార్లు నీటి తడులు కట్టాల్సి ఉంటుంది. వర్షాలు తక్కువగా కురవడంతో ఏడాది నీటి తడులు కట్టుకోవడానికి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. పొలాలు లేని రైతులకు కూడా మిరప ధర చూసి ఈఏడాది చాలామంది కౌలుకు తీసుకొని, రూ.లక్షల అప్పులు చేసి మిరప పంటను సాగు చేశారు. ఈఏడాది ధర రోజురోజుకూ పతనం అవుతుండడంతో రైతు కంట్లో కన్నీరే మిగిలే పరిస్థితి దాపురించింది. కొద్ది వరకైనా అమ్ముకుందామని వెళ్లినా మార్కెట్‌లో మిరప ధర రూ.4 వేల నుంచి అడుగుతుండడంతో రైతు చేసేదేమీ లేక సాగు చేసిన పంటను తీసుకెళ్లి వేర్ హౌస్ భవనాల్లో భద్రపరుస్తున్నారు. ఆ భవనాల్లో పెట్టేందుకు కూడా దాదాపు మూడు రోజులు ఆలస్యం అవుతుందని, రేడులు తీసుకెళ్లే కూడా భవనాల యజమానులు కిరికిరి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మిరపకాయలు తెంచే కూలీలకే దాదాపు రూ.లక్ష వరకు వస్తుందని, ఇప్పుడు కూడా అప్పులు చేసి పెట్టామని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు స్పందించి మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి..?

- చెరువు చంద్రన్న, రైతు, చిప్పగిరి



నాకున్న ఐదెకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఎకరాకు పెట్టుబడి రూ.లక్ష పైగానే వచ్చింది. వర్షాలు తక్కువగా కురవడంతో కాలువల నుంచి నీటి తడులు కట్టేందుకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఈఏడాది ఎకరాకు 4, 5 కింటాళ్లు వచ్చినా కూడా ధర మాత్రం రోజురోజుకూ తగ్గుతోంది. మా బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదు. ప్రభుత్వాలు స్పందించి మిరప రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తే బాగుంటుంది.


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం

- ఆదోని డిఎం రఫీక్

ప్రజాశక్తి - కోసిగి

ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పిస్తామని, బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆదోని డిపో మేనేజర్ రఫీక్, ఎస్‌టిఐ రాఘవేంద్ర తెలిపారు. బుధవారం బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని, పరిసరాలను పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలను ప్రయాణికులను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సివిల్ వర్క్స్ విషయమై సివిల్ ఇంజినీర్‌తో మాట్లాడి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బస్టాండ్ ఆవరణలో ఇష్టానుసారంగా వాహనాలు ఆపినా, ప్రయివేట్ వాహనాలు బస్టాండ్‌లో వచ్చి ప్రయాణికులకు ఇబ్బందులకు గురి చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిబి రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని

ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా టిబి పేద రోగులకు ఆదోనిలోని టిబి కేంద్రంలో బుధవారం టీచర్ నిరంజన్ కుమార్, సిబ్బంది రూ.వెయ్యి విలువ చేసే పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సత్యవతి మాట్లాడారు. దాతలు ముందుకొచ్చి టిబి రోగులను దత్తత తీసుకోవాలని కోరారు. ఎంఒ డాక్టర్ బాల మురళీ కృష్ణ, ఎంపిహెచ్‌ఎస్‌లు బాబురాజు, లలిత, ఎస్‌టిఎస్ స్వరూప్ రాజ్ కుమార్, టిబిహెచ్‌వి మనోరంజని దేవి, సుబ్బమ్మ బాయి, ఎఫ్‌సి వీరేష్ పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయ పార్టీలను తరిమేయండి

- జెబిపి అభ్యర్థి షేక్ షా వలీ

ప్రజాశక్తి-ఆలూరు

ప్రజలకు మాయమాటలు చెప్పి స్వార్థ రాజకీయాల కోసం పనిచేసే పార్టీలను, నాయకులను తమ ఓటుతో తరిమేయాలని జై భారత్ పార్టీ ఆలూరు అభ్యర్థి షేక్ షా వలీ కోరారు. బుధవారం ఎల్లార్తి దర్గాను దర్శించుకొని ఎల్లార్తి, కరిడిగుడ్డం గ్రామంలో పర్యటించారు. టార్చి లైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి నీతి, నిజాయితీగా పనిచేస్తానని తెలిపారు. తన మేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ టార్చి లైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.


కరిడిగుడ్డం గ్రామంలో మాట్లాడుతున్న షేక్ షా వలీ

మాల లక్ష్మి కుటుంబానికి
రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాల లక్ష్మి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు కోరారు. బుధవారం వారు మాల లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని చాగి గ్రామానికి చెందిన మాల లక్ష్మి మిర్చి కోతల కోసం చిప్పగిరికి వెళ్లారని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మాల లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందారని చెప్పారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రభుత్వం మాల లక్ష్మి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ ప్రాంతంలో వర్షాలు సక్రమంగా కురవక, సాగు నీరు లేక, ఉపాధి లేక వేరే ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో వ్యవసాయ కూలీలు నిత్యం ప్రమాదాల బారినపడి మరణిస్తున్నారని, దీనికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ఈ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మించి సాగునీరు అందించాలని, శాశ్వత వలసల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న నాయకులు

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

- డీఎస్పీ శివ నారాయణ స్వామి

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న డీఎస్పీ

ఇష్టంతో చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆకాంక్షించారు. బుధవారం పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఉన్న భాష్యం స్కూలు వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సురేంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే ఆరోగ్యకరమైన జీవితంతో ఉంటారని తెలిపారు. దేశం కోసం పోరాడిన మహానుభావుల ఫొటోలతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకున్న స్థానికుల వివరాలను కూడా విద్యార్థులకు తెలియజేసేలా చిత్రపటాలు ప్రదర్శించాలని కోరారు. మెరుగైన విద్యకు, క్రమశిక్షణకు మారుపేరు తమ భాష్యం స్కూలు అని ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. ఆదోనిలో ఇప్పటికే రెండు బ్రాంచీలు ఏర్పాటు చేశామని, తల్లిదండ్రుల సహకారంతో మరో బ్రాంచి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ భార్గవ్, శిరీష, మాధవ్, శంకర్, శివ, అరుణ పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

టిడిపి అభ్యర్థి ఎంపికపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థి ఎంపికపై ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ జోన్ కోఆర్డినేటర్ బీదా రవిచంద్ర అధ్యక్షతన తిక్కారెడ్డి అనుచర వర్గంతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే టిడిపి అధిష్టానం మాధవరం రాఘవేంద్ర రెడ్డిని టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. అధిష్టాన నిర్ణయం సరైంది కాదని, తిక్కారెడ్డి పదేళ్లుగా పార్టీకి సేవలు అందించారని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటూ వైసిపి వేధింపుల నుంచి టిడిపి శ్రేణులను రక్షించుకున్నారని టిడిపి మండలాల నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. వైసిపి నుంచి 52 రోజుల క్రితం టిడిపిలో చేరిన వ్యక్తికి టికెట్ ఇవ్వడం ఏమిటని, పార్టీలో సేవలు అందించిన సీనియర్లకు టికెట్ ఇచ్చినా సహకారం అందించేవారమని తెలిపారు. పార్టీ అధిష్టానం ఇప్పటికైనా స్పందించి తిక్కారెడ్డికే ఇవ్వాలని, గెలిపించుకుంటామని, లేకపోతే మద్దతు ఇవ్వబోమని చెప్పారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను చంద్రబాబు నాయుడు, లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బిటి.నాయుడు హామీ ఇచ్చారు. ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి, పూజారి వ్యాసరాజాచార్, సీనియర్ నాయకులు అడివప్ప గౌడ్, చెన్నబసప్ప ధని, వెంకటపతి రాజు, భరద్వాజ్ శెట్టి, వక్రాని వెంకటేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బిటి.నాయుడు

ప్రశాంత వాతావరణం కోసం మార్పు అవసరం

- నలుగురిపై బైండోవర్ కేసులు

- తహశీల్దార్ శ్రీధర్ మూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పనకు ప్రవర్తనలో మార్పు రావాలని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి కోరారు. బుధవారం మండలంలోని బూదూరు గ్రామానికి చెందిన ఎం.తిమ్మన్న, సి.శ్రీనివాసులు, సి.రాఘప్ప, సి.నాగరాజుపై బైండోవర్ కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ఎస్ఐ గోపినాథ్ ఆదేశాల మేరకు పోలీసు రంగస్వామి వారిని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. గ్రామాల్లో అలజడులు సృష్టించే ఏ పార్టీ వారైనా సరే వదలకుండా అరెస్టులు చేయాలని కానిస్టేబుల్ రంగస్వామిని ఆదేశించారు. 6 నెలల పాటు గ్రామంలో ఎలాంటి తగాదాలకూ వెళ్లకూడదని ఒక్కొక్కరికి రూ.2 లక్షల పూచీకత్తుతో జామీను ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు సహకరించాలని, లేకపోతే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న తహశీల్దార్ శ్రీధర్ మూర్తి

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలి

- బుట్టా రేణుక కుమారుడు ప్రతుల్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడిన వైసిపి ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని, ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కుమారుడు బుట్టా ప్రతుల్ కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని 18వ వార్డులో కౌన్సిలర్ రంగమ్మ, వార్డు ఇన్‌ఛార్జీ సోమేష్, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామంటూ మభ్యపెట్టి మోసగించేందుకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని ఓటర్లకు సూచించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో టిడిపి ప్రభుత్వాన్ని నాడు ప్రజలు ఇంటికి పంపారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికలొచ్చాయని, మళ్లీ కల్లబొల్లి హామీలు గుప్పించిన టిడిపిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. వైసిపితోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తమ తల్లి బుట్టా రేణుకకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, కౌన్సిలర్లు నీలకంఠ, డిష్ కేశవ రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యులు కొండాపురి అబ్రార్, టౌన్ బ్యాంకు డైరెక్టర్ రజాక్, కన్వీనర్ గోకారి, నాయకులు ఇలాఖత్, యూసుఫ్, రఘువీరా, గౌస్, శీను, నరసింహులు, శీను, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా రేణుక కుమారుడు ప్రతుల్

ప్రసాద్‌కు బుట్టా రేణుక పరామర్శ

కర్నూలులోని ఓమిని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బనవాసి గ్రామం ప్రసాద్‌ను వైసిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తానని తెలిపారు.


ప్రసాద్‌ను పరామర్శిస్తున్న బుట్టా రేణుక


ప్రజలకు మంచి జరగడం బాబుకు ఇష్టం లేదు

- వాలంటీర్లపై చంద్రబాబు కుట్రలు

- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజలకు మంచి జరగడం చంద్రబాబుకు ఇష్టం లేదని, అందుకే వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాల పంపిణీకి అడ్డుపడుతున్నారని వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి విమర్శించారు. బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ప్రయివేట్ అతిథి గృహంలో సర్పంచి తెల్లబండ్ల భీమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వాలంటీర్ల ద్వారా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పింఛన్లను ప్రతినెలా సకాలంలో అందించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు వాలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ కాకుండా, ఇతర అన్ని విధుల్లో పాల్గొనకుండా, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఉత్తర్వులు వచ్చేలా చంద్రబాబు నాయుడు చేయడం బాధాకరమన్నారు. ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, నాయకులు జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భీమిరెడ్డి

వైసిపిలోకి జనసేన మండల అధ్యక్షులు

ప్రజాశక్తి- దేవనకొండ


వైసిపిలో చేరుతున్న కిట్టు

జనసేన పార్టీ మండల అధ్యక్షులు మక్బుల్ బాష బుధవారం వైసిపి ఎంపీ అభ్యర్థి బివై.రామయ్య, జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. జడ్‌పిటిసి రామకృష్ణ గృహానికి విచ్చేసిన సందర్భంగా పార్టీలో చేరి వైసిపి కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా మక్బుల్ బాష మాట్లాడారు. బిజెపి, టిడిపి కూటమిలో స్థానిక జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు లేకపోవడంతో వైసిపిలో చేరినట్లు తెలిపారు.

వైసిపిలోకి జడ్‌పిటిసి కిట్టు

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌తో పాటు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరిన జడ్‌టిసి కిట్టు తిరిగి వైసిపి గూటికి చేరారు. వైసిపి కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వైసిపి కర్నూలు ఎంపీ అభ్యర్థి బివై.రామయ్య, జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి హాజరై వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షితో కలిసి ప్రారంభించారు. అనంతరం రామయ్య, సురేందర్ రెడ్డిలు జడ్‌పిటిసి కిట్టు ఇంటికి వెళ్లి ఆయనతో చర్చించి పార్టీలోకి ఆహ్వానించారు. కొంత కాలం పాటు వైసిపికి దూరంగా ఉన్న నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ... అందరూ కలిసికట్టుగా వైసిపిని గెలిపించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు.

జగన్ గెలుపును ఆపలేరు : వైసిపి

ప్రజాశక్తి - కోసిగి


ప్రచారం నిర్వహిస్తున్న మురళీ మోహన్ రెడ్డి

ఎవరెన్ని కుట్రలు పన్నినా ముఖ్యమంత్రి జగన్ విజయాన్ని ఆపలేరని వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని డి.బెళగల్, ఐరన్‌గల్లు గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డికి మద్దతుగా ఏడోరోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాటు ఇంటి వద్దే సేవలను అందిస్తున్న వాలంటీర్లపై నేడు చంద్రబాబు విషం కక్కుతున్నారని విమర్శించారు. తోడేళ్లంతా ఒక్కటై వస్తుంటారని, వారిని నమ్మారంటే సంక్షేమ పథకాల రద్దుకు అంగీకరించినట్లేనని తెలిపారు. ఐరన్‌గల్ సర్పంచి రామాంజనేయులు, మండల కన్వీనర్ బెట్టన్న గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ స్వామి, నాడిగేని నాగరాజు, దొడ్డి నరసన్న, బసిరెడ్డి, వీరస్వామి, భీమసేన పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. బుధవారం కౌతాళంలోని హనుమాన్ నగర్, వడ్డే గేరి, బయటి గేరి, తలారి గేరి, జంగల్ వీధిలో నాయకులు ఉల్లిగయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు చంద్రబాబు అసెంబ్లీ సీటు కేటాయించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి ఓటు వేసి అసెంబ్లీకి పంపాలని కోరారు. అధికారం వచ్చిన వెంటనే కౌతాళంలో తాగునీటి సమస్య, రోడ్ల సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. టిడిపిని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. మంత్రాలయం అభివృద్ధిలో వెనుకబడిందని, టిడిపి అధికారంలో వస్తే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీఇచ్చారు. టిడిపి నాయకులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, నీలకంఠ రెడ్డి, కురువ వీరేష్, జనసేన నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడబూరు : టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి గెలుపు కోసం టిడిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. బుధవారం రాఘవేంద్రరెడ్డి సోదరుడు, టిడిపి యువనేత రామకృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, టిడిపి నాయకులు మీసేవ ఆంజనేయులు, తలారి అంజి, మహదేవ, గోనుమాను నరసన్న, డీలర్ నరసప్ప బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని తారాపురం, రంగాపురం గ్రామాల్లో ఎమ్మెల్యేగా రాఘవేంద్రరెడ్డిని ఆశీర్వదించాలని, మీ సేవకుడిగా పని చేస్తారని తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన బాలనాగిరెడ్డి సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని వివరించారు.


ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో ఆర్ఓ తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్ఓ మురళీ, తహశీల్దార్ సురేష్ బాబుతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని హనుమాపురం, రాగిమాన్ దొడ్డి, గంగులపాడు, దొడ్డిమేకల, కంబదహాల్, జాలవాడి, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. పెద్దకడబూరులోని పోలింగ్ బూత్‌లోని వసతులపై ఆర్ఓ మురళీ అసహనం వ్యక్తం చేశారు. అక్కడి విఆర్‌ఒలు నరసప్ప, వీరారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ సురేష్ బాబు, ఎఒ వరప్రసాద్, ఎంఇఒ-2 రామమూర్తి, ఎస్ఐ మహేష్ కుమార్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.